# వెరసి

ఒక్క క్షణం సూర్యుడి కళ్ళు చెదిరాయి.

కిటికీలోంచి దొంగచాటుగా తొంగిచూచిన తన కిరణాలు టేబుల్ మీద వజ్రాల వుంగరం మీదపడి తళుక్కుమనేసరికి సూర్యుడి కళ్ళు చదిరాయి.

కిరణాలు కిందికి జారాయి.

తొమ్మిదవ వస్తూంది.

చౌదరిగారు బద్ధకంగా ఒత్తిగిల్లి పడుకున్నాడు.

తొమ్మిదిన్నరయింది.

చౌదరి లేచాడు. పోమ్‌పరుపు 'హమ్మయ్య' అనుకుంది.

మత్తుగా కళ్ళుమూసుకుని మెళుకువలోనే కలలాటిదాన్ని కల్పించుకోవాలని యత్నించాడాయన.

కళ్ళుతెరచి పక్కమీద చూచుకున్నాడు.

ఊహు!

నిన్నరాత్రి షూటింగయ్యాక పార్టీనుండి వచ్చి తాను ఒంటరిగానే పడుకున్నాడు. మాలిని లేదు.

మాలిని వచ్చింది మొన్నరాత్రి.

చిరునవ్వు వెలిగింది ఆయన పెదవులమీద.

మంచం అంచుకు జరిగి కాళ్ళను క్రిందికి జార్చాడు.

మెత్తటి తివాసీమీద చరిణదాసిలా పడివున్న హవాయి చెప్పులలోకి పాదాలను పోనిచ్చాడు.

లేచి నిలువుటద్దం ఎదుట నిల్చున్నాడు.

నుదుటి దగ్గర ఆ నెరసిన వెంట్రుకలు ఎంత దర్పంగావున్నాయి–!

కిటికీలోంచి తోటలోకి చూశాడు. మంచి బాక్సాఫీసు షీట్‌లా పచ్చగా వుంది తోట : అది చూచిన నిర్మాత మనసులా నిగనిగలాడు తూంది ఎండ.

చౌదరి టేబిల్ దగ్గరకెళ్ళి ఉంగరాన్నితీసి వేలికి పెట్టుకున్నాడు. బయటకి నడిచాడు.

*　　　*　　　*

వజ్రాల వుంగరంలో తనందం తాను చూచుకున్న ఆ సూర్యుడే అప్పునాయకన్ వీధిమేడమీది వాటా కిటికీలోంచి దూరి ఖాళీ సోడాబుడ్డీల మీదుగా జారి విస్కీ సీసాను కౌగలించుకున్నాడు.

ఇప్పుడు విస్కీని ముట్టుకోవటం విజ్ఞత కాదనుకున్నాడు కాబోలు. ఆ సీసానుంచిన స్టూల్‌మీదుగా కిందికి దిగాడు.

ఆ పక్కను నవారు మంచంకాలి మీదుగా దిగింపోక కొపిటలిస్టు నల్లి. అది సేవించింది విప్లవరక్తం కావడంమూలాన్ని దానికి జ్వరంవచ్చి నట్లుగా వుంది.

"ఫ్యూడల్ దుర్యోధనుడి
తొడల్ విరగ్గొట్టే
భీముణ్ణి

గుడిలో దేవుడుగాడిని పీకి

గుడిసెలో రావులుగాడిని
దేవుడిగాచేసే
రాముణ్ణి

ధనస్వామ్యం కాలనాగును
కాలరాచి 'కేబరే' ఆడే
కాలభైరవుణ్ణి

పద్మవ్యూహాల ప్రజాస్వామ్యాన్ని
చర్మవేషంతో చెండాడే
మార్కండేయుణ్ణి

వచ్చా! వచ్చా! వచ్చాను నేను!
అంచేత బ్రదర్స్

జాగ్‌తేరహో!" అని వీరశంఖం పూరించి జాతిని మేలుకొలిపిన విప్లవకవి నరసింహం మత్తుగా పొర్లి. నల్లి కుట్టిపోయినచోట గోక్కున్నాడు.

సరిగ్గా అపుడే ఆ గదిలోకి వచ్చింది ఆయన మూడవ భార్య పంకజం.

"ఏమండీ! లేవండీ! ఇవాళ "సూర్యకళా"లో రికార్డింగుందన్నారు అని లేపింది. లేచాడు నరసింహం. శనివారం ఉదయమేలేచి తలకు నీళ్లు పోసుకుని పూజ ముగించివచ్చిన పంకజం గుమ్మందగ్గరే నిలబడి వుండడం చూచాడు.

మంచం దిగాడు. స్టూల్‌మీది సీసాను చూశాడు. కొద్దిగా మిగిలి వున్నట్లుంది. చేతిలోకి తీసికుని ఖాళీచేశాడు సీసా. పంకజం ఆపాటికే వెళ్ళిపోయింది.

గది బయటకు నడిచాడు.

*　　　*　　　*

'చంద్రజ్యోతి' స్టుడియోలో హడావిడి.

లక్ష రూపాయల సెట్టు! కళాకారుడు సేన్‌వర్మ అహోరాత్రులు శ్రమించి నిర్మించిన ఫ్యాక్టరీ సెట్టు.

'అనకాపల్లి అమరచిత్ర ఇంటర్‌నేషనల్' వారి "బాటసారీ! నీ పయనం ఎటు?" చిత్రం (కలర్, స్కోపు)లో పతాక సన్నివేశ చిత్రీకరణం.

సమ్మెచేస్తున్న రెండువందలమంది కార్మికులు వారి భార్యలు ఫ్యాక్టరీ గుమ్మందగ్గర గుమికూడుతున్నారు.

వారంరోజులు పస్తులతో మాడినా యాజమాన్యం లొంగి రాలేదు! బయటనుండి దొంగచాటుగా వేరే సిబ్బందిని తీసుకొచ్చి ఫ్యాక్టరీని నడిపించాలని చూస్తున్నది. ఇది విన్న కార్మికలోకం కస్సుమని బుసలుకొడుతూ లేచింది. వారి నాయకుడు, సామ్యవాది అయిన రవికుమార్ మార్చ్‌కు నాయకత్వం వహిస్తున్నాడు. కార్మికుల భార్యలకు నాయకత్వం రవికుమార్ ప్రేమిస్తున్న రామలక్ష్మి వహిస్తూంది. బడాపెట్టుబడిదారయిన భూపతి తెప్పించుకున్న పోలీసులు బయినెట్లతో బారులుతీర్చి నిల్చున్నారు.

వెయ్యి మెగా టన్నుల టి.ఎన్.టి. మీద—అగ్ని శిఖలను కక్కడానికి సిద్ధంగావున్న అగ్నిపర్వతంమీద—

చిటుక్కంటే కూలడానికి సిద్ధంగావున్న కొండంచుమీద—వున్నారు వాళ్లు.

"గెలిస్తే గెలవాలి!

చస్తే చావాలి" — ఇది కార్మిక లోకం పట్టిన పిడికిలి.

"ఎదవ సన్నాసులు దీపపుపురుగుల్లా కాలరాచేయగలను" — ఇది డబ్బుయొక్క అహం.

అనాదినుండి వస్తున్న వర్గ సంఘర్షణ.

కార్మికుడి చెమటకూ, కేపిటలిస్టు డబ్బుమూటకూ మధ్య ఘర్షణ.

"బోలో స్వతంత్ర భారత్‌కూ—జై"

"కార్మిక లోకం లేచింది"

"యాజమాన్యమా! నీ ఆగడాలకు ఆయువు మూడింది"

"తాడో పేడో, తేలాలి నేడే!"

"రక్తం చిందిస్తాం: హక్కులు సాధిస్తాం!!"

"ఇది ఇరవైయవ శతాబ్దం; ఆటవికత నశించాలి."

అని కార్మికులు ఫిరంగి గుళ్ళ వర్షంలా నినాదాలిస్తూ ఫ్యాక్టరీ గేటును సమీపిస్తున్నారు.

డాబా మీదనుండి బైనాక్యులర్‌తో ఇదంతా చూస్తున్న భూపతి రక్తం కుతకుత ఉడికిపోతూంది. అతడి పక్కనే వున్నాడు ఎస్.పి.

మాట్లాడుకుంటున్నారు వారిద్దరూ.

కార్మికులు ఉద్రేకంతో వరద గోదావరిలా ఉరికివచ్చి పోలీసులను దాటి ఫ్యాక్టరీ గేటుల్ని ఎక్కడానికి యత్నిస్తున్నారు.

పోలీసులు తుపా...

'కట్' అన్నాడు చౌదరి.

డైరెక్టర్ సీతాపతిరావు హఠాత్తుగా తల తిప్పి చూశాడు

"ఈ సీన్‌లో ఇంకా ఉద్రేకం వుండాలి! ఇంకా వేడి రావాలి. వారంరోజులు సమ్మెతో నలిగిపోయి తమ జీవితాలనే సమిధలుగా అర్పించడానికి సిద్ధమైన ఆ కార్మికుల దృఢనిశ్చయం, వారి బాధ, వారి ఆక్రోశం ఇంకా ప్రస్ఫుటం అవాలి—" అన్నాడు చౌదరి.

"యూ ఆర్ రైటండీ" అన్నాడు నరసింహం.

"అయితే "సీజ్ ఆఫ్ బెర్లిన్" లోలా ఒక మార్చింగ్ ట్యూన్ కంపోజ్ చేయించి దానితోబాటు ఈ కార్మికుల దాడి పెడదామంటారా?" అని అడిగాడు సీతాపతిరావ్.

"అగ్నిపర్వతం - కార్మిక హృదయం

బాధ పడింది - బద్దలయింది—" అంటూ చరణాన్ని 'హమ్' చేయసాగాడు విప్లవ కవి.

రవికుమార్ వేషంలో వున్న "నటకుల వతంస" శేషగిరికూడా ఈ చర్చలో పాల్గొన్నాడు. "ఈ కార్మిక హృదయం మీకెంతబాగా తెలుసండీ!" అని చౌదరిని మెచ్చుకున్నాడు.

'మరొక లక్షఖర్చయినా సరే కాని ఆ పీడిత తాడిత ప్రజలకు నాచిత్రం ప్రతిబింబం కావాలి' అని కృతనిశ్చయంతో గంభీరంగా పలికిన చౌదరి చూపు ఏవో దూరతీరాలను తాకింది.

* * *

'జాటసారీ నీ పయనం ఎటు?' చిత్రం విడుదలవడానికి వారం ముందరనుంచి ప్రేక్షక మహాశయులు బుకింగ్ కౌంటర్లదగ్గర తిష్ఠవేశారు.

తెలుగు దేశమంతా కలిపితే మొదటిరోజు మూడు ఆటలకు ఎనిమిది లక్షలు వసూలయింది.

న భూతో న భవిష్యతి అని తెలుగు జనం విరగపడి చూశారు.

విజయవాడలో చౌదరిగారి గౌరవార్థం ఏర్పాటుచేసిన సన్మాన సభ కిటకిటలాడిపోయింది. అన్ని చేంబర్స్‌వాళ్ళూ, రోటరీవారు లయన్స్‌వారూ వైస్‌మెన్స్‌వారూ, జేసీస్‌వారూ, ఇన్నర్ వీల్ వారూ అభిమానాల సంఘాల వాళ్లూ పూలమాలలతో సన్మానపత్రాలతో ముంచెత్తారు.

చౌదరిగారి మీద నరసింహం విప్లవగానం చేశాడు.

చౌదరికి 'కళా జగత్ నేత' అన్న బిరుదు నిచ్చారు.

అది స్వీకరించిన చౌదరి వినయంతో - తన కళద్వారా సమాజాన్ని బాగుచేయడమే తన లక్ష్యమనిచెప్పి ఇకముందు ఎప్పుడూ సాంఘిక ప్రయోజనంలేని చిత్రాలు తాను తీయను గాక తీయను—అని శపథం చేసినప్పుడు అక్కడ ఉన్న నాలుగువేలమందీ, పదినిమిషాలపాటు ఆపకుండా చప్పట్లు కొట్టారు.

"నా తదుపరి చిత్రం—" సంఘమా! దారి ఇటు! 'లో కూడా శేషగిరి-మాలిని ప్రధాన పాత్రలు నిర్వహిసారు-'అని ప్రకటించారు చౌదరి.

ఆటో గ్రాపులు, కరచాలనాలు, పార్టీలతో అర్ధరాత్రిదాకా సాగింది సన్మాన సభ.

* * *

"బాటసారీ-ఎటు? వందరోజులాడాక ఒకరాత్రి చౌదరి తన పడగ్గదిలో వున్నాడు. అది మే, నెలయినా రెండు ఏర్‌కండిషనర్లూ కలిసి ఆ గదిని డార్జిలింగ్ చేశాయి.

తలుపులన్నీ మూసి వున్నాయా అని చూశాక క్రిందకూర్చుని తివాసీని దొర్లించసాగాడు. ట్యూబ్ లైట్ల వెన్నెలలో అతడి చేతి వేళ్ళ మీదున్న రెండు వజ్రపుటుంగరాలూ తళుకు లీనుతున్నాయి.

తివాసీ క్రింద నేలలో నేలగా వున్న ఒక తలుపుని తెరిచాడు చౌదరి.

—అరగంట తర్వాత చెమటలు కక్కుకుంటూ తివాసీని మామూలుగా సరిచేశాడు.

'విప్లవం చాలా లాభసాటే!' అని నవ్వుకున్నాడు చౌదరి.

—ఊటీలో 'రాక్ డేల్'లో కూచుని అయిదవ రౌండు సేవిస్తున్న నరసింహమూ ఆమాటే అనుకున్నాడు !

★